TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 44 | పేజీలు : 05| వెల: రూ.3/- తెలంగాణ సోమవారం | మే 25, 2026




## కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో 'కాక్రోచ్ పార్టీ'

- జెన్-జీ యువత తప్పదోవ పడుతోందా?
- సామాజిక మాధ్యమాల్లో కోట్ల లైకులు..
- వాస్తవ సమస్యలపై అచేతనం
- సుప్రీంకోర్టు వ్యాఖ్యల వక్రీకరణే పెట్టుబడిగా సోషల్ మీడియా ప్రస్థానం
- వారసత్వ రాజకీయాలు, నిరుద్యోగంపై యువత అసలైన పోరాటం చేయాలి

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయ నిరసన స్వరూపం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన ఆందోళనలు.. నేడు మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సామాజిక మాధ్యమాల వేదికగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే జెన్–జీ (Gen–Z) యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ' (బొద్దింకల పార్టీ). ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా, ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను ఎండగట్టే పేరుతో సోషల్ మీడియాలో కోట్ల లైకులతో చక్కర్లు కొడుతోంది. అయితే, దీని వెనుక ఉన్న అసలు లక్ష్యాన్ని, సూత్రధారులను పరిశీలిస్తే.. ఇది పక్కాగా కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) గేమ్ ప్లాన్‌లో భాగంగా వ్యూహాత్మకంగా పుట్టుకొచ్చిందనే వాస్తవం స్పష్టమవుతోంది.

### కోర్టు ధిక్కరణే ఆయుధంగా..

అమెరికా నుండి సోషల్ మీడియా వేదికగా అభిజిత్ దీప్కే అనే వ్యక్తి ప్రకటించిన ఈ కాక్రోచ్ పార్టీ వెనుక ఆప్ ఎజెండా దాగి ఉంది. గతంలో ఆప్ దేశవ్యాప్తంగా సాగించిన ప్రచార శైలికి ఇది అద్దం పడుతోంది. సుప్రీంకోర్టు గౌరవ న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యువతను 'బొద్దింకలు, పరాన్నజీవులతో' పోల్చారంటూ ఈ పార్టీ నిర్వాహకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అయితే, నకిలీ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టీఐ కార్యకర్తలుగా చలామణి అవుతూ సమాజంపై పడుతున్న అక్రమార్కులను ఉద్దేశించి జస్టిస్ సూర్యకాంత్ ఆ వ్యాఖ్యలు చేశారు. ఆ సందర్భాన్ని తెలుసుకోకుండా, కోర్టు వ్యాఖ్యలను వక్రీకరించి 'బొద్దింకల పార్టీ' పేరిట మద్దతు కూడగట్టడం ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. ఈ పార్టీ ప్రకటించిన ప్రధాన ఐదు హామీలు కూడా కాంగ్రెస్, ఆప్‌ల ఎజెండాను పోలి ఉండటం గమనార్హం.

( మిగతా వివరాలు 2 వ పేజీలో)

## నాలుగోసారి పెరిగిన ఇంధన ధరలు

- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు
- పది రోజుల్లోనే లీటరుకు సుమారు రూ.8 దాకా వడ్డన

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలో ఇంధన మంటలు సామాన్య, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న పరిణామాల సాకుతో ప్రభుత్వ రంగ చమురు సంస్థలు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను మరోమారు పెంచాయి. తాజా సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. పెంచిన ఈ ధరలు సోమవారం నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. కాగా, గత పది రోజుల స్వల్ప వ్యవధిలోనే ఇంధన ధరలు పెరగడం ఇది వరుసగా నాలుగోసారి కావడం గమనార్హం. వరుసగా జరుగుతున్న ధరల పెంపుదలతో గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ. 8 వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాల అంచనా. తాజా పెంపుతో దేశంలోని ప్రధాన నగరాల్లో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకాయి. ఢిల్లీ: పెట్రోల్ లీటరుకు రూ. 102.12, డీజిల్ రూ. 95.20, హైదరాబాద్: పెట్రోల్ లీటరుకు రూ. 115.58, డీజిల్ రూ. 103.74, విజయవాడ: పెట్రోల్ లీటరుకు రూ. 117.19, డీజిల్ రూ. 104.88 గా ఉన్నాయి. పశ్చిమాసియా ప్రాంతంలో ముదురుతున్న ఉద్రిక్తతలు, చమురు రవాణాపై నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విపరీతంగా ఎగబాకుతున్నాయని చమురు రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే అంతర్జాతీయ మార్కెట్ భారాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా సామాన్య వినియోగదారులపైనే మోపుతున్నాయని ఆర్థిక విశ్లేషకులు విమర్శిస్తున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీయనుంది. రవాణా ఖర్చులు (ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు) పెరిగితే మార్కెట్లో నిత్యావసర సరుకులు, కూరగాయలు, పప్పు ధాన్యాల ధరలు కూడా ఆటోమేటిక్‌గా ఆకాశాన్ని తాకుతాయని, తద్వారా సామాన్యుడి బతుకు మరింత భారమవుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు ఇలాగే ఉద్రిక్తంగా కొనసాగితే భవిష్యత్తులో ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.



## బతికుంటే సాయం సున్నా.. చస్తే కనీస మర్యాద లేదు

- రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- భద్రాచలంలో మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లిన అమానుష ఘటన
- కేసీఆర్ తెచ్చిన వైకుంఠ రథాలను పక్కనబెట్టారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్వజమెత్తారు

2లో..



2లో..



## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

- ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్ధాలు
- ఎన్సాన్‌పల్లి ఐకేపీ సెంటర్ సందర్శించిన హరీష్ రావు

## మహిళా శక్తికి అండగా రాష్ట్ర ప్రభుత్వం


సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని విప్లవాత్మక నిర్ణయాలను ప్రకటించింది. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా 8 వేల 'ఇందిరా స్త్రీ శక్తి భవనాల' నిర్మాణానికి ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు అందించే 'ఇందిరమ్మ చీరల' నూతన డిజైన్లను కూడా సీఎం విడుదల చేశారు.

## కేంద్రం సహకరించకపోయినా మొక్కవోని, ధాన్యం కొనుగోలు చేస్తున్నాం

2లో..



- సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రితో భేటీ అయిన కూనంనేని నేతృత్వంలోని సీపీఐ బృందం
- కార్మికుల కనీస వేతనాల పెంపుపై ప్రభుత్వానికి కమ్యూనిస్టు నేతల ధన్యవాదాలు

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, మే 25, 2026

## కేంద్రం సహకరించకపోయినా మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేస్తున్నాం

**సీఎం రేవంత్‌రెడ్డి**

**ముఖ్యమంత్రితో భేటీ అయిన కూనంనేని నేతృత్వంలోని సీపీఐ బృందం**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సహకరించకపోయినప్పటికీ, రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను నిరంతరాయంగా చేపడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని సీపీఐ ఉన్నత స్థాయి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. ఈ భేటీలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఇతర ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రంలో మొక్కజొన్న దిగుబడి చాలా అద్భుతంగా వచ్చిందని తెలిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లు చేయడం లేదని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వాటిల్లినా సరే.. రైతుల క్షేమం కోసం తామే స్వయంగా మొక్కజొన్నను కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలోనూ కేంద్రం నుండి ఆశించిన మద్దతు లేకపోయినా, పకడ్బందీగా కొనుగోళ్లు జరుపుతున్నట్లు సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సీపీఐ నాయకులు ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది కార్మిక కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వారు హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరతను అధిగమించి, సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో సీపీఐ బృందం నుండి ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ, ఇ.నరసింహ, పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసులతో పాటు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో 'కాక్రోచ్ పార్టీ'

- **జెన్-జీ యువత తప్పుదోవ పడుతోందా?**
- **సామాజిక మాధ్యమాల్లో కోట్ల లైకులు..**
- **వాస్తవ సమస్యలపై అచేతనం**
- **సుప్రీంకోర్టు వ్యాఖ్యల వక్రీకరణే పెట్టుబడిగా సోషల్ మీడియా ప్రస్థానం**
- **వారసత్వ రాజకీయాలు, నిరుద్యోగంపై యువత అసలైన పోరాటం చేయాలి**

(మొదటి పేజీ తర్వాత…).

### కుటుంబాల గుప్పిట్లోనే చట్టసభలు

భారతదేశ జనాభాలో 65 శాతానికి పైగా 35 ఏళ్ల లోపు ఉన్న యువకులే. ఇంతటి అపారమైన శక్తి కలిగిన యువత ప్రశ్నించాల్సింది వారసత్వ రాజకీయాలను. నేడు పార్లమెంటు, అసెంబ్లీలు కొన్ని కుటుంబాల గుప్పిట్లోనే బందీ అయ్యాయి. కాంగ్రెస్‌లో సోనియా, రాహుల్, ప్రియాంక ఒకే కుటుంబం నుండి చట్టసభల్లో ఉండగా.. బీజేపీలో అమిత్ షా కుమారుడు ఏ అర్హతతో బీసీసీఐ అధ్యక్షుడయ్యారని యువత ప్రశ్నించాలి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. ఏపీలో చంద్రబాబు కుటుంబం నుండి లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు ప్రజాప్రతినిధులుగా ఉంటే.. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా, వివేక్ కొడుకు వంశీ ఎంపీగా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో కొనసాగుతున్నారు. మల్లు భట్టి విక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి–పద్మావతి దంపతులు ఒకే ఇంట నుండి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎందరో యువకులు బలిదానాలు చేసుకుంటే, కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి దోచుకుంది. జెన్–జీ యువత గబ్బిలాల్లాగా చట్టసభలను పట్టుకుని వేలాడుతున్న ఇటువంటి రాజకీయ శక్తులను ఎందుకు నిలదీయడం లేదు?




### అన్నా హజారేకే వెన్నుపోటు పొడిచిన చరిత్ర

అవినీతి వ్యతిరేక ఉద్యమం నుండి పుట్టుకొచ్చిన 'ఆప్' చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే సాగించిన పవిత్ర ఉద్యమాన్ని హైజాక్ చేసి అధికారంలోకి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్, నేడు తానే స్వయంగా అవినీతి కూపంలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ము చేసి, గురువైన అన్నా హజారేనే మోసం చేసిన చరిత్ర వారిది. నేడు అదే ఆప్ నేపథ్యం ఉన్న వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా 1.6 కోట్ల ఫాలోవర్లతో దేశంలోనే అతిపెద్ద నెట్‌వర్క్‌గా అవతరించి యువతను తప్పుదోవ పట్టించడం దౌర్భాగ్యం.

### యువతరం అసలైన కార్యాచరణ ఏది?

సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా రాత్రికి రాత్రే అధికార పార్టీల్లోకి ఫిరాయించే నాయకులను నిలదీయడంలో తప్పు లేదు. కానీ, ఆ పోరాటం మరొక రాజకీయ పార్టీ ప్రయోజనాల కోసం సృష్టించిన వేదిక ద్వారా కాకుండా స్వతంత్రంగా జరగాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న పాలకులను, వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెడుతున్న అక్రమార్కులను, దేశంలో నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న పాలకులను యువత నిలదీయాలి. ఇటీవల జరిగిన 'నీట్' పరీక్షా పత్రాల లీకేజీ వంటి దేశవ్యాప్త కుంభకోణాలపై గొంతెత్తాలి. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుండి అస్సాం గణపరిషత్ పోరాటం వరకు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల వరకు దేశంలో యువతదే కీలక భూమిక. నేటి తరం యువత కూడా ఓటు వేయడానికి బద్ధకించకుండా, కేవలం ఆన్‌లైన్ లైకులకు పరిమితం కాకుండా చట్టసభల్లోకి నేరచరితులు రాకుండా అడ్డుకోవాలి. పాలకులను ప్రశ్నించే ఆరోగ్యకరమైన వేదికలు నిర్మించుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది.

## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

- **ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్ధాలు**
- **ఎన్సాన్‌పల్లి ఐకేపీ సెంటర్ సందర్శించిన హరీష్ రావు**

**సిద్దిపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనం వల్లే తెలంగాణ రైతాంగం నేడు రోడ్లపై అరిగోస పడుతోందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీరు, కరెంట్ సరఫరా, యూరియా పంపిణీతో పాటు పండించిన పంటను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి, కళ్లాల్లో పేరుకుపోయిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. "తెలంగాణ చరిత్రలో రైతులు ఇంతలా బాధపడటం నేను ఎప్పుడూ చూడలేదు. మొన్నటికి మొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని బడాయిలు చెప్పి, ఇప్పుడు కేవలం 70 లక్షల మెట్రిక్ టన్నులే కొంటామనడం ఎంతవరకు సబబు? మీది నోరా.. మోరా?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే, కేవలం 70 లక్షల టన్నులు కొని మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని నిలదీశారు. కేంద్రంపై నెపం నెట్టడం మానేసి, అవసరమైతే కేంద్రం మెడలు వంచైనా ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు. "తాలు, తరుగు పెడితే మిల్లుల తోలు తీస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికారు. కానీ క్షేత్రస్థాయిలో సిద్దిపేట నియోజకవర్గంలోనే క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతుల రక్తాన్ని పిండుతున్నారు" అని హరీష్ రావు మండిపడ్డారు. రోహిణి కార్తె ప్రవేశించినా ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, కొనుగోళ్లు సకాలంలో జరక్క ధాన్యపు కుప్పలపైనే దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్నది 'మిషన్ మోడ్' కాదని, అది 'కమిషన్ మోడ్' అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. నిన్నటి క్యాబినెట్ సమావేశంలో ధాన్యం కొనుగోళ్లపై కీలక నిర్ణయం తీసుకుంటారని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. దేవుళ్లపై ఒట్లు పెట్టి, 45 రోజుల్లో రైతుబంధు ఇస్తామని చెప్పి 60 రోజులు దాటినా పైసా వేయలేదని, రేవంత్ రెడ్డి కేవలం 'పేపర్ టైగర్' మాత్రమేనని విమర్శించారు. ఇప్పటికైనా ఢిల్లీ ట్రిప్పులు మాని, కళ్లాల్లోని ధాన్యాన్ని తరలించడానికి లారీల ట్రిప్పులు పెంచాలని హితవు పలికారు. రాజకీయ విమర్శలు పక్కనబెట్టి ధాన్యం కొనుగోలు సమస్యకు తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కాకపోతే తానే స్వయంగా సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నాకు దిగుతానని హెచ్చరించారు. వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## బతికుంటే సాయం సున్నా.. చస్తే కనీస మర్యాద లేదు

- **రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**
- **భద్రాచలంలో మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లిన అమానుష ఘటన**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్వజమెత్తారు**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో మానవత్వం పూర్తిగా మంటగలిసిపోయిందని, బతికున్నప్పుడు ప్రజలకు సహాయం చేయని ఈ ప్రభుత్వం.. చనిపోయాక కూడా కనీస గౌరవం దక్కనివ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ నిరుపేద మృతదేహాన్ని కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్లిన దారుణ ఘటనపై ఆయన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా స్పందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేటీఆర్ తన పోస్టులో.. "తెలంగాణలో పరిస్థితి ఇంత దారుణంగా దిగజారిపోవడం అత్యంత బాధాకరం. పేదల అంతిమయాత్ర కూడా గౌరవప్రదంగా సాగాలనే ఉద్దేశంతోనే గత కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మృతదేహాల ఉచిత తరలింపునకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. అదే మానవత్వం, ప్రజల గౌరవాన్ని కాపాడే నిజమైన పాలన. కానీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కష్టాలను పట్టించుకోవడం మానేసి కేవలం రాజకీయ కక్షసాధింపులు, ప్రచార ఆర్భాటాలకే పరిమితమైంది" అని ధ్వజమెత్తారు. నాయకుల పాదయాత్రలకు విలాసవంతమైన బస్సులు, ప్రభుత్వ ప్రచారాలు, సభలు, హెలికాప్టర్ల పర్యటనల కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న రేవంత్ సర్కార్.. పేదలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ తెస్తామన్న 'మార్పు' ఇదేనా? అని ఆయన ప్రశ్నించారు. ఈ దారుణ ఘటన కేవలం ఒక కుటుంబానికి చెందిన విషాదం మాత్రమే కాదని, ప్రస్తుతం తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న దుస్థితికి అద్దం పడుతోందని మండిపడ్డారు. భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన కండె వెంకన్న (42) అనే వ్యక్తి వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆయనను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లడానికి ప్రైవేట్ వాహనాన్ని సమకూర్చుకునే ఆర్థిక స్థోమత లేక, ఆస్పత్రి అధికారులను మార్చురీ వ్యాన్ ఏర్పాటు చేయాలని కుటుంబ సభ్యులు గంటల తరబడి వేడుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు నిరీక్షించినా అధికారుల నుండి ఎలాంటి స్పందన కరువైంది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన కుటుంబ సభ్యులు, చేసేదేమీ లేక వెంకన్న మృతదేహాన్ని తమ భుజాలపైనే మోసుకుంటూ వీధుల గుండా ఇంటికి తీసుకెళ్లారు. ఈ హృదయవిదారక దృశ్యాన్ని చూసి స్థానికులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించడంలో వైద్యాధికారులు, ప్రభుత్వం విఫలమయ్యాయని స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపడంతో మాజీ మంత్రి కేటీఆర్ దీనిపై తీవ్రస్థాయిలో స్పందించారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
సోమవారం, మే 25, 2026

# 'అప్ప శివ' జ్యువెలర్స్ ప్రతిభా పురస్కారాలు

- విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత
- హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పట్టణంలోని చారిత్రాత్మక అంబేద్కర్ చౌరస్తా సోమవారం విద్యా కుసుమాల కోలాహలానికి వేదికైంది. అప్ప శివ జ్యువెలర్స్ సౌజన్యంతో, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి నియోజకవర్గంలోనే టాప్‌గా నిలిచిన విద్యార్థులకు ఘనంగా 'ప్రతిభ అవార్డుల' ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.20,000, ద్వితీయ స్థానానికి రూ. 10,000, తృతీయ స్థానానికి రూ. 5,000 నగదు బహుమతులతో పాటు, పదో తరగతిలో 400 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులందరికీ ప్రత్యేక మెమొంటోలు, ప్రతిభ అవార్డులను ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. వెనుకబడిన నల్లమల ప్రాంతం నుంచి వచ్చిన అప్ప శివ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇలాంటి భారీ నగదు పురస్కారాలతో అవార్డులు అందించడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. నియోజకవర్గంలోని పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువులో అత్యుత్తమ స్థాయికి ఎదగాలనే ఆకాంక్షతో విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం అభినందనీయమన్నారు. అప్ప శివ గారు భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ, ఈ మంచి కార్యక్రమానికి తన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రైవేటు సంస్థలు సైతం సామాజిక బాధ్యతతో విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలవడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ విద్యా పురస్కారాల మహోత్సవంలో వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఘనంగా పీసీసీ చీఫ్ జన్మదిన వేడుకలు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రథసారథి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు భారీ కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుండి ప్రస్థానాన్ని ప్రారంభించి, తన నిరంతర శ్రమ, అంకితభావంతో ఈరోజు రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్ గారి జీవన ప్రస్థానం ప్రతి ఒక్క కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుం మధు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సీనియర్ నాయకులు కూరగాయల కొమురయ్య, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పాత సత్యలక్ష్మి పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు కొండ శేఖర్, సిరిగిరి శ్రీకాంత్, కో–ఆప్షన్ సభ్యులు పీర్ మహమ్మద్, కట్కూరి శ్రీనివాస్, సాబీర్, మరియు ముఖ్య నాయకులు దండుగుల తిరుపతి, దూలం భూమేష్ గౌడ్, పల్లెపు రాజేందర్, లింగంపల్లి కిరణ్, పెంట స్వరణ్, అక్కి సునీల్, బైరి నాగరాజు, కొత్త అనిల్, నాగరాజు, నక్క సాయి, మైలారం రాము తదితర కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# 'మిషన్ భగీరథ' నీరు రాక ఇబ్బందులు


- తీవ్ర రూపం దాల్చిన తాగునీటి ఎద్దడి
- బోరు బావులు ఎండిపోయి..
- వాటర్ క్యాన్ల కోసం మైళ్ల దూరం ప్రయాణం



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలో 'మిషన్ భగీరథ' నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో స్థానిక ప్రజలు చుక్క నీటి కోసం అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా అమ్రాబాద్ మండల కేంద్రంలోని 7వ వార్డు పరిధిలో గల చిన్న మస్జిద్ ఏరియా, అలాగే అయ్యూబ్ గ్రామ పంచాయతీ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి సమస్య జటిలమై, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ఎండల తీవ్రతకు తోడు గత కొన్ని రోజులుగా భగీరథ నీరు రాకపోవడంతో కాలనీల్లో కరవు తాండవిస్తోంది. దీనికి తోడు స్థానికంగా ఉన్న బోర్లన్నీ ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఇటు తాగడానికి భగీరథ నీరు లేక, అటు గృహ అవసరాలకు బోరు నీళ్లు కూడా రాక ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. దాహం తీర్చుకోవడానికి కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్తూ, నెత్తిన వాటర్ క్యాన్లు మోసుకుంటూ తిరగాల్సిన దుస్థితి వచ్చిందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో నీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గతంలోనే పలుమార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఆర్టీసీ బాబా ఇంటి వద్ద ఉన్న మోటార్ మరమ్మతుల గురించి, అలాగే అయ్యూబ్ ఇంటి వద్ద కొత్త బోర్ వెల్ ఏర్పాటు చేయాలని విన్నవించినప్పటికీ పంచాయతీ పాలకవర్గం నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. "7వ వార్డు ప్రజలు కూడా ఈ గ్రామంలో భాగమే కదా? లేక మా వార్డుపై స్థానిక అధికారులు ప్రత్యేకంగా ఏమైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారా?" అని కాలనీవాసులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ప్రజలు నీటి కోసం రోడ్లపైకి వచ్చి ఇబ్బందులు పడిన తర్వాతో, లేదా ఆందోళనలు చేసిన తర్వాతో స్పందించడం కాదని.. సమస్య తీవ్రతను గుర్తించి ముందే పరిష్కారం చూపడమే స్థానిక ప్రజాప్రతినిధుల, అధికారుల కనీస బాధ్యత అని కాలనీవాసులు హితవు పలుకుతున్నారు. ఇప్పటికైనా స్థానిక సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించి, అమ్రాబాద్ 7వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యకు తక్షణమే చర్యలు చేపట్టి, యుద్ధప్రతిపాదికన నీటి సరఫరాను పునరుద్ధరించాలని 7వ వార్డు ప్రజల తరపున గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# విలాసాగర్ చెరువులో 'మట్టి' దందా

- సెలవు దినాల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు
- అధికారుల అండదండలతోనే కాంట్రాక్టర్ల దోపిడీ
- తవ్వకాలు ఆపకుంటే రైతాంగంతో కలిసి పోరాటం
- సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్




**బోయిన్‌పల్లి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలంలో మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను, పర్యావరణ చట్టాలను పూర్తిగా తుంగలో తొక్కి కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని విలాసాగర్ గ్రామ చెరువులో ఆదివారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ, ఎలాంటి భయం లేకుండా యథేచ్ఛగా భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ అక్రమ మట్టి తవ్వకాలపై మండల సీపీఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బోయిన్‌పల్లి మండలంలో కొంతమంది అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటం వల్లే మట్టి మాఫియా ఇంతలా పెట్రేగిపోతోందని ఆరోపించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం.. అనుమతి ఉన్న చోట కేవలం ఉదయం 8:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు మాత్రమే తవ్వకాలు జరపాల్సి ఉంటుందని, రాత్రి వేళల్లో కానీ, సెలవు దినాల్లో కానీ తవ్వకాలు జరపడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు.కానీ విలాసాగర్ చెరువులో నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో కూడా పగలు, రాత్రి తేడా లేకుండా వందలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ సంపదను దోచుకుంటున్నారని శ్రీధర్ మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, మైనింగ్ మరియు రెవెన్యూ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఈ అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను కఠినతరం చేసి, సహజ వనరులను, చెరువులను కాపాడాలని రైతాంగం పక్షాన ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం వహిస్తే రైతులను, ప్రజాసంఘాలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# అడవిలో ఎలుగుబంటి దాడి..

- చెంచు మహిళకు తీవ్ర గాయాలు

**బల్మూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండల పరిధిలోని కొండనాగుల ఈస్ట్ బీట్ పవన కుంట అటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అడవిలోకి మేకల కాపలాకు వెళ్లిన ఓ చెంచు మహిళపై ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని చెంచుగూడెం గ్రామానికి చెందిన నిమ్మల రాములు భార్య నిమ్మల సాలమ్మగా గుర్తించారు. స్థానికులు, అటవీశాఖ తెలిపిన వివరాల ప్రకారం.. సాలమ్మ ఎప్పటిలాగే ఆదివారం మధ్యాహ్నం అటవీ ప్రాంతంలో మేకలను మేపుతోంది. ఈ క్రమంలో తన పిల్లలతో కలిసి సంచరిస్తున్న ఓ ఎలుగుబంటి ఒక్కసారిగా సాలమ్మపై విరుచుకుపడింది. ఈ భీకర దాడిలో సాలమ్మ శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే రక్తపు మడుగులో కుప్పకూలిపోయింది. ఎలుగుబంటి దాడి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మల్లేశం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రాజు, మీనాక్షిలు తక్షణమే ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దట్టమైన అడవిలో గాయాలతో పడి ఉన్న మహిళను సురక్షితంగా బయటకు తీసుకువచ్చి, మెరుగైన వైద్యం కోసం అచ్చంపేటలోని మహదేవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు అత్యవసర చికిత్స అందుతోందని, ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కాగా, అటవీశాఖ అధికారులు బాధితురాలి కుటుంబానికి తక్షణ ఉపశమనం కింద రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ ఘటనపై



అచ్చంపేట ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ చంద్రశేఖర్ స్పందిస్తూ అడవికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా పశువులు, మేకల కాపరులు, కట్టెల సేకరణకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అడవిలోకి ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా వెళ్లాలని కోరారు. అడవి జంతువులు ఎక్కడైనా కనిపిస్తే వాటిని హింసించకుండా, తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
సోమవారం, మే 25, 2026

# పొలంలో విరిగిన కరెంట్ స్తంభాలు..

## పట్టించుకోని విద్యుత్ అధికారులు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది అచ్చంపేట మండల పరిధిలోని సింగారం గ్రామం. అటూఇటూ కాని అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా అన్నదాతలు రెండు పంటలు సాగు చేసుకోలేక, పండించిన పొలాన్ని బీడుగా వదిలేసి తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన రైతులు గండికోట శేఖర్, రాములు, తిరుపతయ్య, శ్రీను, వెంకటయ్యలకు చెందిన వ్యవసాయ పొలాల్లో గత అక్టోబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వాటితో పాటు సుమారు నాలుగైదు స్తంభాల పొడవు గల కరెంట్ వైర్లు కూడా తెగి నేలపై పడిపోయాయి. పొలంలో ప్రమాదకరంగా పడి ఉన్న కరెంట్ స్తంభాలు, వైర్లను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని బాధితులు గత ఎనిమిది నెలలుగా స్థానిక విద్యుత్ సిబ్బంది చుట్టూ తిరుగుతున్నారు. అయినా సంబంధిత సిబ్బంది ఏమాత్రం స్పందించకపోగా.. "మీ సమస్య ఏదైనా ఉంటే పోయి ఏఈ ఆంజనేయులుకు చెప్పుకో" అంటూ అత్యంత నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. పొలమంతా కరెంట్ వైర్లు, విరిగిన స్తంభాలు అడ్డంగా పడి ఉండటం వల్ల భయంతో గత రెండు సీజన్లలో వ్యవసాయం సాగు చేయలేకపోయామని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. పోనీ ఈ సీజన్‌లోనైనా సాగు చేసుకుందామంటే ఇప్పటికీ అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ సమస్యను పరిష్కరించకుంటే, తమ కుటుంబాలతో కలిసి హాజీపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి తాళం వేస్తామని రైతులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ విషయమై 'వాయిస్ ఆఫ్ వందే భారత్' ప్రతినిధి విద్యుత్ శాఖ ఏఈ ఆంజనేయులును సంప్రదించగా.. ఆయన వింత సమాధానం ఇచ్చారు. ఈ సమస్యను లైన్‌మెన్ శంకర్ తన దృష్టికి ఈ రోజే తీసుకువచ్చారని ఏఈ తెలిపారు. గతంలో రైతులు పొలంలో పంట వేసుకున్న కారణంగా పనులు చేయలేకపోయామని సాకు చెబుతూ.. త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థల పరిశీలన

- సర్వరెడ్డిపల్లి తండాలో రూ.800 కోట్లతో 'మెగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్'
- స్థలాన్ని పరిశీలించిన ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ
- స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు
- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వెల్లడి



**వంగూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో పారిశ్రామిక ప్రగతికి సరికొత్త బాటలు పడనున్నాయి. వంగూర్ మండలం సర్వరెడ్డిపల్లి తండా పరిధిలో బహుళజాతి కంపెనీల భాగస్వామ్యంతో ఏకంగా రూ.800 కోట్ల భారీ వ్యయంతో, 1000 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిష్టాత్మక మెగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా సోమవారం నాడు నాగర్‌కర్నూల్ పార్లమెంట్



సభ్యులు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట శాసనసభ్యులు (టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు) డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలు సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్టుకు కేటాయించిన భూ స్థలాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. భూ స్థలాన్ని సందర్శించిన అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ ప్రణాళికలు, రాబోయే రోజుల్లో ఇక్కడ ఏర్పాటు చేయనున్న ఆధునిక యంత్రాలు, అత్యాధునిక ప్రాసెసింగ్ విభాగాలు మరియు అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తి విధానాల బ్లూప్రింట్లను అధికారులతో కలిసి సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల పారిశ్రామికీకరణకు కట్టుబడి ఉందని, అందులో భాగంగానే వంగూర్ మండలంలో ఈ భారీ కేంద్రాన్ని తీసుకువస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. అచ్చంపేట నియోజకవర్గ చరిత్రలోనే ఇదొక మైలురాయి ప్రాజెక్టుగా నిలిచిపోతుందన్నారు. రూ.800 కోట్ల భారీ పెట్టుబడితో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో నిర్మించ తలపెట్టిన ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, పరిసర ప్రాంతాల రైతులకు వారు పండించే పంటలకు స్థానికంగానే మంచి డిమాండ్ ఏర్పడి ఆర్థికంగా బలోపేతం అవుతారని వెల్లడించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ భూ పరిశీలన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు, బహుళజాతి కంపెనీల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సర్వరెడ్డిపల్లి తండా గ్రామస్థులు పాల్గొన్నారు.

# డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో సామాన్యుడిపై భారం



- ఐఎన్‌టీయూసీ నేత మహబూబ్ అలీ

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచుకుంటూ పోతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ ఐఎన్‌టీయూసీ తాలూకా అధ్యక్షులు మహబూబ్ అలీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఐఎన్‌టీయూసీ ముఖ్యాధికారులతో కలిసి మాట్లాడారు. డీజిల్ ధర లీటరుకు రూ.102 దాటడంతో రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడి, మార్కెట్లో ప్రతి వస్తువు ధర భరించలేనంతగా పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణాన్ని అడ్డం పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలను విపరీతంగా పెంచుతోందని మహబూబ్ అలీ ఆరోపించారు. "ధరల పెంపు వల్ల చింతపండు, పప్పులు, ఉప్పు, వంట నూనె, సబ్బులతో పాటు నిత్యావసర సరుకులన్నీ ఆకాశాన్ని తాకుతున్నాయి. ఉన్నవాళ్లకు ఈ కష్టాలు తెలియకపోవచ్చు కానీ, లేనివాడు మార్కెట్‌కు వెళ్తే కంటికి కన్నీళ్లు వస్తున్నాయి. బతకలేని పరిస్థితికి ప్రజలను దిగజారుస్తున్నారు. సామాన్యులు ఏ వస్తువు కొనాలన్నా ఏడ్చే పరిస్థితి వచ్చింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇంధన దోపిడీ నిరంతరాయంగా సాగుతోందని ఐఎన్‌టీయూసీ నేతలు ధ్వజమెత్తారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతి లీటర్ ఇంధనంపై ఏకంగా రూ. 34 పన్ను రూపంలో వసూలు చేస్తోందని వారు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రజలపై నిజంగానే చిత్తశుద్ధి, జాలి ఉంటే.. ఆ రూ. 34 పన్నును కనీసం రూ. 15 కి తగ్గించి తమ నిజాయితీని చాటుకోవాలని సవాల్ విసిరారు. సామాన్యుడి బతుకు భారమవ్వక ముందే పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రకటన, సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ పాషా, బల్మూర్ మండల అధ్యక్షులు చందు నాయక్, ఉప్పునుంతల మండల అధ్యక్షులు రామచంద్రయ్య, అచ్చంపేట మండల అధ్యక్షులు మౌలానా, తాలూకా సహాయ కార్యదర్శి ఉస్మాన్, తాలూకా జాయింట్ సెక్రెటరీ వెంకటేష్ తదితర కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న సుదర్శన్ ఎడ్యుకేషనల్ సొసైటీ

- అంబలి కేంద్రానికి రూ.25 వేల ఆర్థిక సాయం

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సమాజ సేవలో అచ్చంపేట పట్టణానికి చెందిన ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు ముందంజలో ఉంటున్నాయి. పట్టణంలో గత పదేళ్లుగా రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అంబలి కేంద్రానికి ప్రముఖ సామాజిక వేత్త, అచ్చంపేట మాజీ సర్పంచ్, సుదర్శన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ గార్లపాటి సుదర్శన్ భారీ ఆర్థిక సాయాన్ని అందజేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఈ ఏడాది అంబలి కేంద్రాన్ని మరో పది రోజుల పాటు అదనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో, తన వంతు సహకారంగా రూ. 25,000/- నగదును రక్షిత మహిళా సొసైటీ ప్రతినిధులకు ఆయన ఈరోజు అందజేశారు. ఈ అంబలి కేంద్రం ద్వారా ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల సమయానికి సుమారు 100 నుండి 500 మంది వరకు పేదలు, రైతులు, హమాలీ కార్మికులు తమ దాహార్తిని, ఆకలిని తీర్చుకుంటున్నారు. పదేళ్లుగా నిరంతరాయంగా ఈ సేవా కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తున్న రక్షిత మహిళా సొసైటీ సభ్యులను ఈ సందర్భంగా సుదర్శన్ అభినందించారు. ఈ సందర్భంగా గార్లపాటి సుదర్శన్ మాట్లాడుతూ.. అచ్చంపేట పరిసర ప్రాంతాల్లోని పేద విద్యార్థినులకు తమ సొసైటీ ద్వారా ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రకటించారు. ప్రతిభ ఉండి, ఆర్థిక స్తోమత లేక ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థినులను ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. డాక్టర్, ఇంజనీరింగ్ వంటి పైచదువులు చదవాలనుకునే నిరుపేద విద్యార్థులకు తమ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా పూర్తి ప్రోత్సాహం, ఆర్థిక సహాయం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. సుదర్శన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ప్రతి ఏటా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న గార్లపాటి సుదర్శన్ సేవలను అచ్చంపేట పట్టణ ప్రజలు నిండు హృదయంతో అభినందిస్తున్నారు. ఆయన మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నారు. అచ్చంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యపల్లి మస్తాన్, రక్షిత మహిళా సొసైటీ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రతిభ వెలుగులోకి రావాలి

- వెల్టూర్ కబడ్డీ శిక్షణ శిబిరానికి దాతల భారీ సాయం
- రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్ష



**వెల్టూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ (ఉప్పునుంతల):** క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లోనూ అద్భుతంగా రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని శ్రీ శ్రీ కట్ట మైసమ్మ దేవస్థాన చైర్మన్, పాఠశాల పూర్వ విద్యార్థి ఎడ్ల నరేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో కొనసాగుతున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల సాధనను పరిశీలించిన ఆయన.. క్యాంప్ నిర్వహణకు, క్రీడాకారులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఉదారంగా మాట ఇచ్చారు. గతంలోనూ వెల్టూర్ కబడ్డీ క్యాంప్‌కు పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈసారి కూడా క్రీడాకారులు, నిర్వాహకులు ఏది అడిగినా కాదనకుండా అంతకంటే పెద్ద మొత్తంలో సాయం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎడ్ల నరేష్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల నుండి విద్యార్థులు వెల్టూర్ విచ్చేసి క్రీడల్లో శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. వీరిని చూసి స్థానిక విద్యార్థుల్లో కూడా క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తమ ప్రతిభను చాటి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అండగా నిలుస్తూ ఉదారత చాటుకున్న ఎడ్ల నరేష్‌ను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీ) రమేష్, క్రీడాకారులతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక నాయకులు గంట నరేష్, శివ, శిక్షణ శిబిరం నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో కేసీఆర్ మనవడు హిమాన్షు ప్రత్యేక పూజలు



**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మనువడు, కేటీఆర్ తనయుడు హిమాన్షు రావు సందర్శించారు. సోమవారం తన స్నేహితులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయన, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ సంప్రదాయం ప్రకారం హిమాన్షు తన స్నేహితులతో కలిసి స్వామివారికి ఎంతో పవిత్రమైన 'కోడె మొక్కు' చెల్లించుకున్నారు. అనంతరం గర్భాలయంలో భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. దర్శనానంతరం ఆలయ మండపంలో అర్చకులు హిమాన్షు బృందానికి వేదోక్తంగా ఆశీర్వచనం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, నిమ్మచెట్టి విజయ్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ సేవే మాధవ సేవ

- 701వ రోజుకు చేరిన అన్నపూర్ణ ట్రస్ట్ అన్నదానం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** 'మానవ సేవే మాధవ సేవ' అనే నినాదంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడలో అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమం విజయవంతంగా 701వ రోజుకు చేరుకుంది. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల్లోని అన్నార్తులకు, యాచకులకు సోమవారం సంస్థ ప్రతినిధులు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యకర్త సౌజన్య గారి జన్మదినాన్ని పురస్కరించుకొని, వారి అభిమాని అందించిన ఆర్థిక సాయంతో ఈరోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవకు సంస్థ శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్ – జ్యోతి దంపతులు (భాను ఏజెన్సీస్)తో పాటు సంవత్సర దాతలు తోట లక్ష్మి, కూరగాయల మధు – మమత దంపతులు ప్రత్యేక సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోట లహరి మాట్లాడుతూ.. వేములవాడకు వచ్చే నిరుపేదలు, యాచకులు ఎవరూ ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంతో గత 701 రోజులుగా నిరంతరాయంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతోనే ఈ సుదీర్ఘ సేవా యజ్ఞం సాధ్యమవుతోందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతామని, ఈ సేవా పథంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు, మానవతావాదులు తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి 8919376459 మొబైల్ నంబరును సంప్రదించాలని తోట లహరి కోరారు. ట్రస్ట్ ప్రతినిధులు తోట లహరి, రాజేష్, సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నాగరాజ్ గౌడ్



**అమరచింత, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార సంస్థ కార్పొరేషన్ నూతన వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి, తనకు ఈ ప్రతిష్టాత్మక కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నాగరాజు గౌడ్ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార సంస్థ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఉంచిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. అనంతరం నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో కార్పొరేషన్ ద్వారా గీత వృత్తిపై ఆధారపడిన కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు మరియు వారి ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# కొండె రామ్‌పాల్‌కు ఉస్మానియా వర్సిటీ డాక్టరేట్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన యువ పరిశోధకుడు కొండె రామ్‌పాల్ ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. మారుమూల గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి, ఉన్నత విద్యలో విశిష్ట ప్రతిభ కనబరిచి అత్యున్నతమైన డాక్టరేట్ సాధించడం అచ్చంపేట ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. బొమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన కొండె చెన్న కిష్టయ్య కుమారుడైన రామ్‌పాల్ ఆరుగురు సోదరులతో కూడిన పెద్ద సాధారణ రైతు కుటుంబంలో పెరిగారు. ఎటువంటి ఆర్థిక అండదండలు లేకపోయినా, కేవలం విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే బలమైన పట్టుదలతో ఆయన ముందడుగు వేశారు. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ విద్యాసంస్థలలోనే పూర్తి చేయడం విశేషం. చిన్ననాటి నుంచే చదువుపై అమితమైన ఆసక్తి కలిగిన రామ్‌పాల్, అనేక ఆర్థిక ఇబ్బందులను, సవాళ్లను ఎదుర్కొంటూనే పట్టుదలతో పరిశోధనా రంగంలో ఈ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. రామ్‌పాల్ "బౌద్ధ జీవన విధానం: బౌద్ధములో నైతిక తత్వశాస్త్రంపై ఒక అధ్యయనం" అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సమగ్ర పరిశోధన నిర్వహించారు. శాతవాహన విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, ఉన్నత విద్యామండలి మాజీ వైస్ చైర్మన్, ప్రముఖ ప్రొఫెసర్ శంకాశాల మల్లేశం (వెలిచాల మల్లేశం) సమర్థవంతమైన పర్యవేక్షణలో ఈ పరిశోధనా వ్యాసాన్ని పూర్తి చేశారు. ఈ పరిశోధనలో బౌద్ధ ధర్మంలోని నైతిక విలువలు, మానవతా దృక్పథం, సమానత్వ భావన, శాంతియుత జీవన విధానం మరియు సమాజ నిర్మాణంలో బౌద్ధ తత్వశాస్త్ర ప్రాధాన్యత వంటి అంశాలను రామ్‌పాల్ విశ్లేషాత్మకంగా ప్రతిపాదించారు. నేటి ఆధునిక సమాజంలో ఎదురవుతున్న సంక్షోభాలకు బౌద్ధ నైతిక తత్వం ఏ విధంగా పరిష్కారం చూపుతుందనే ప్రాసంగికతను ఈ అధ్యయనంలో స్పష్టంగా వివరించారు. పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసినందుకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం రామ్‌పాల్‌కు అధికారికంగా డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చి ఓయూలో డాక్టరేట్ సాధించిన కొండె రామ్‌పాల్‌ను వారి కుటుంబ సభ్యులు, బొమ్మన్‌పల్లి గ్రామస్థులు, మిత్రులు, శ్రేయోభిలాషులతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు, తోటి పరిశోధక విద్యార్థులు హృదయపూర్వకంగా అభినందించారు. రామ్‌పాల్ సాధించిన ఈ విజయం ఉన్నత చదువులు చదవాలనుకునే ఎంతోమంది గ్రామీణ ప్రాంత యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని స్థానిక ప్రజలు, మేధావులు కొనియాడారు.

# ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**మల్హర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని తాడిచెర్ల సమీపంలోని మానేరు నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్ లను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ తెలిపారు.పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను కొయ్యూరు పోలీసు స్టేషన్ కి తరలించినట్టు వారు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇసుక అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై 2 రాజన్,హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, పిసి మధు పాల్గొన్నారు.